

శేష వాహనంపై సిద్దేశ్వరుడు
అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో సిద్దేశ్వర, చెన్నకేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శివ, కేశవులకు వాహన సేవలు నిర్వహించారు. - 8లో



పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.310	రూ.370
రెండోరకం	రూ.200	రూ.300

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1055 మెట్రిక్ టన్నులు



మహా నివాళి



మిస్ యూ నాన్న..
వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్ భావోద్వేగం



వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

రాయచోటి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహాలు, వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు ఘన నివాళులు అర్పించారు. మరుపురాని మహానేతను స్మరించుకుంటూ.. పార్టీ శ్రేణులు, అభిమానులు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వాల్మీకిపురంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. రైల్వేకోడూరులో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘమైన దూరదృష్టితో వైఎస్‌ఆర్ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రామాపురం మండలంలో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. మదనపల్లి మండలం తట్టివారిపల్లెలో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీమ్‌అస్లాం, నియోజకవర్గ పరిశీలకురాలు ఎస్.అనీషారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో యువజన నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజంపేట పట్టణంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి, రాయచోటిలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక నాయకులు వేడుకలలో పాల్గొన్నారు. సంబేపల్లె మండలంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, చిన్నమండెంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లెలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో పోలీసుల ఆంక్షలు

నిమ్మనపల్లెలో పోలీస్ ఆంక్షల నడుమ వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు నిర్వహించాల్సి వచ్చింది. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నిమ్మనపల్లెలో పర్యటిస్తున్న కారణంగా.. ఎమ్మెల్యే తిరిగి వెళ్లే వరకు వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు నిర్వహించకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. ఎమ్మెల్యే వెళ్లిన తర్వాత మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వేడుకలు నిర్వహించారు.



ఒంటిమిట్టలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఇడుపులపాయలో..

కడప కార్పొరేషన్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు బాంధవుడని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. వైఎస్సార్ 76వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో డాక్టర్ వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన సతీమణి వైఎస్ విజయమ్మ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరుముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రజల కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ..



జననేతను చూసి.. కూలీల సంబరం



రాయచోటిలో వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

వైఎస్ జగన్‌తో జిల్లా నేతలు

రాయచోటి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కలుసుకున్నారు. మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయకు వచ్చిన వైఎస్ జగన్‌ను కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యంలు వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అంతకు ముందుగా వారంతా వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో కలిసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులు, కరువుతో అల్లాడుతున్న పరిస్థితులపై వైఎస్ జగన్‌కు వివరించారు.

ప్రేమాలయంలో అన్నదానం

రామాపురం మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి వృద్ధులకు, ప్రజలకు అందించిన సంక్షేమం గూర్చి ఆయన వివరించారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా నేతలు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య

రాయచోటి టౌన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య తెలిపారు. రాయచోటి ఎన్‌జీవో హోంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. జిల్లా మానిటరింగ్ అధికారి రియాజ్ బేగ్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖలో పని చేసే ఉన్నత స్థాయి అధికారులు గ్రామీణ ప్రాంతంలోని ఆశావర్కర్లు, ఇతర ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవీన్, వసీం అక్రమ్, అబ్దుల్ లతీఫ్, వజ్ర అమ్రీన్, విష్ణువర్ధన్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి జమరామయ్య, సూపర్‌వైజర్ నూర్జాహాన్, ఆరోగ్యకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



పశుగ్రాస వారోత్సవాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు

నందలూరు : రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 14 వరకు జరిగే పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా నందలూరు మండలం పాటూరు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాసం పెంపుదల, పశుగ్రాసాల్లో బహు వార్షికాల గడ్డి, వాటి ప్రాముఖ్యత, మెలకువలపై వివరించారు. కార్యక్రమంలో రాజంపేట ఉపసంచాలకులు విజయభాస్కర్‌రావు, రాజంపేట సహాయ సంచాలకులు ప్రతాప్, లోకేష్, నందలూరు పశువైద్యులు ఈశ్వర్‌ప్రసాద్, మాధవీలత, జేవీఓలు సుగుణ, గంగులయ్య, వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు జాహ్నవి, శ్రీనాథ్, సుస్మిత, శివరాం, గులాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై సౌమ్యనాథస్వామి



కోలాటం చేస్తున్న మహిళలు



హనుమంత వాహనంపై స్వామి వారి దర్శనం

నందలూరు : నందలూరులో శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీ సౌమ్యనాథస్వామి ఆశీనులై శ్రీరామచంద్రమూర్తి అవతారంలో భక్తులకు కనువిందు కలిగించారు. ఈ గ్రామోత్సవం నందలూరు, పేటగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొనసాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు వెంట మహిళల కోలాటం భక్తులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం ఉదయం శేషవాహనం, గ్రామోత్సవం, తిరుమంజనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఉపాధి హామీ ద్వారా మొక్కల పెంపకం

కలెక్టర్ చామకూరి శ్రీధర్

వీరబల్లి : గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరబల్లి మండలం వంగిమల గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పొలంలో కలెక్టర్ నిమ్మ చెట్లు నాటి రైతులు, ఉపాధి శ్రామికులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద రైతుల పొలాల గట్లతోపాటు ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటి, శ్రామికులకు వంద రోజుల పని దినాలు కల్పించాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, ఏపీడీ, తహసీల్దార్, ఎంపీడీఓ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వీరపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు: 572లో విలేకరులకు ఇచ్చిన భూములను ఆయన పరిశీలించారు. సంబంధిత భూములపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అర్జీదారులు కలెక్టర్‌ను కోరిన నేపథ్యంలో ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పీఎం సూర్యఘర్ పథకం అమలులో బ్యాంకులు సహకరించాలి

రాయచోటి : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం అమలులో బ్యాంకులు సహకరించాలని, జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక క్యాంపుల ద్వారా జన్ ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఆర్థిక ప్రచార కార్యక్రమాలను జిల్లా పంచాయతీ శాఖ అధికారితో సమన్వయం చేసుకొని ప్రజలందరికీ తెలియజేసి ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కోటిరెడ్డి స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఏపీజీబీ విజయవిహారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిచక్రం.. స్వర్ణోత్సవం

ఉభయ వైఎస్సార్ జిల్లాలో కడప తర్వాత ఏర్పాటైంది రాజంపేట ఆర్టీసీ డిపో. ఇది ఏర్పాటై 50ఏళ్లు పూర్తి కానుంది. కేవలం ఏడు బస్సులను రోడ్డుపైకి తీసుకొచ్చారు.గోల్డెన్ జూబ్లీ చేసుకోనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- రాజంపేట ఆర్టీసీ డిపోకు 50 ఏళ్లు
- కడప తర్వాత రెండో డిపో
- ఏడు బస్సులతో సేవలు
- స్వర్ణోత్సవాలు నిర్వహించేనా!



రాజంపేట ఆర్టీసీ డిపో

రాజంపేట: ఉభయ వైఎస్సార్ జిల్లాలో పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేటలో ఆర్టీసీ ఆవిర్భావం ఐదు దశాబ్దాలకు చేరుకుంది. 1975 ఆగస్టు 15న డిపో ఏర్పాటుచేయాలని అప్పట్లో సంస్థ నిర్ణయించింది. కడప తర్వాత ఏర్పాటైన తొలి డిపో. ఈ క్రమంలో రాజంపేట-రాయచోటి రోడ్డులోని ఇప్పుడున్న ఎల్ఐసీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఆర్టీసీ సేవలను తాత్కాలికంగా ప్రారంభించారు. కడపకు అప్పటికే ఏర్పాటైన డిపో నుంచి కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ కార్మికులను రప్పించారు. ఏడుబస్సులను తొలిసారిగా రోడ్డెక్కించారు.చరిత్ర ఘనంగా ఉన్నా అభివృద్ధి తిరోగమన దిశలో ఉంది. 50 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తారా అని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ హయాంలో..

మాజీ శాసనసభ్యురాలు కొండూరు ప్రభావతమ్మ ఆధ్వర్యంలో రాజంపేటలో ఆర్టీసీ ఏర్పాటుకు ప్రస్తుతం ఎర్రబల్లి ప్రాంతంలోని ఆరున్నర ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలంలో బస్‌స్టేషన్, ఆర్టీసీ కార్మికుల క్వార్టర్స్, డిపో గ్యారేజీల నిర్మాణం చేపట్టారు.ఇప్పుడు ఆర్టీసీ బస్టాండు ఇదే.ప్రస్తుతం ఈ స్థలాలకు కోట్లాది రూపాయల విలువ ఉంది. ఆర్టీసీ బస్టాండు,డిపో పట్టణానికే కేంద్రంగా మారింది.

- డిపో ఏర్పాటు తర్వాత అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరుతో సమానంగా బస్సు సర్వీసులను ఇక్కడి నుంచి నడిపారు. 2011-2012 వరకు 125 బస్సులు ఉండేవి. ఆర్టీసీ కార్మికులతో కళకళలాడింది. సబ్‌డివిజన్ పరిధిలో రైల్వేకోడూరు, రాజంపేట పరిసర ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు బస్సులను ఏర్పాటు చేశారు. పల్లెపల్లెకు బస్సులు నడిచేవి. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వచ్చింది.
- మాజీ ముఖ్యమంత్రి జలగంవెంగళరావు, మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ హయాంలో చరిత్ర సృష్టించిన డిపో..ఇప్పుడైతే తిరోగమనదిశలో పయనిస్తుందనే విమర్శలున్నాయి. బస్సు సర్వీసులు తగ్గిపోయాయి. సగానికిపైగా పల్లెలకు బస్సులు తిరగడం లేదు. ప్రైవేట్ వాహనాల కారణమని ఆర్టీసీ వారు చెబుతున్నారు. ఆర్టీసీకి 40 బస్సులు ఉండగా, అద్దె బస్సులు 30 ఉన్నాయి. ఆర్టీసీ ఆదాయం కూడా ఘననీయంగా పడిపోతూవచ్చింది.

డిపో అభివృద్ధి పట్టని కూటమి ప్రభుత్వం

డిపో అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా కొత్త బస్సులు కేటాయిస్తే, ఒకే ఒక్క బస్సును రాజంపేటకు కేటాయించడం విమర్శలకు దారితీస్తోంది. గత పాలనలో కేటాయించిన పెట్రోలు బంక్‌ను ఇప్పుడు అందుబాటులోకి తీసుకొచ్చింది. కనీసం అన్నమయ్య పేరుతో ఉన్న బస్‌స్టేషన్‌ను ఆధునికీకరణ చేయలేదు. ఆర్టీసీ క్యాంపస్‌లో ఉన్న క్వార్టర్స్ భవనాలు శిధిలావస్థకు చేరిపోయాయి. వాటిని పునర్నిర్మించే పరిస్థితి లేదు. ఆర్టీసీ డిపోకు ప్రహరీగోడను కూడా నిర్మించలేదు.

జిల్లా వాసి మంత్రి అయినా ఫలితం శూన్యం

జిల్లా వాసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రవాణాశాఖ మంత్రిగా ఉన్నా 50 ఏళ్ల చరిత్ర కలిగిన రాజంపేట ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో అభివృద్ధి విషయంలో ఫలితం శూన్యమేనని ఈ ప్రాంతానికి చెందినవారు పెదవి విరుస్తున్నారు. మంత్రి తన ప్రాంతంలో డిపో అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యత రాజంపేటకు ఇవ్వలేదని అంటున్నారు. ఈ డిపోపై వివక్ష చూపుతున్నారనే ఆరోపణలున్నాయి.

పూర్వవైభవం వచ్చేనా...

రాజంపేట ఆర్టీసీ డిపో రోజురోజుకు తిరోగమన దిశలో ఉంది. కొత్తకొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంతోపాటు పలు పుణ్యక్షేత్రాలకు డిపోనుంచి డైరెక్ట్ కనెక్టివిటీ సర్వీసులను ఫ్రీక్వెన్సీగా పెంచాలని ఆర్టీసీ వర్గాలవారు అంటున్నారు. నందలూరు ఆర్ఎస్ టు రాజంపేట ఆర్ఎస్ బసు సర్వీసుతోపాటు పల్లె సర్వీసులను పున రుద్ధరించాల్సిన అవసరం ఉంది. బ్యాటరీ బస్సులను ప్రవేశపెడితే రాజంపేట ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం వస్తుందని కార్మికులు చెబుతున్నారు. వందలాది రూట్‌లలో బస్సు సర్వీసులు ఉండగా, ఇప్పుడు 37 సర్వీసులకు వచ్చింది. ప్రస్తుతం 343 మంది కార్మికులు ఉన్నారు.

- రాజంపేట ఆర్టీసీ డిపో ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి కావస్తోంది. 50 ఏళ్ల కిందట వేసి శిలాఫలకం కాలగర్భంలో కలిసిపోయింది. సిల్వర్ జూబ్లీ చేసుకుంటున్న క్రమంలో ఆర్టీసీ అభివృద్ధిలో నూతన మార్పులు వస్తాయా? ఆ దిశగా ఆర్టీసీ యాజమాన్యం ఆలోచిస్తుందా అని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

పూర్వవైభవం తీసుకురావాలి



కడప తర్వాత రాజంపేటలోనే ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.డిపో ఏర్పాటై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలి. ఆ బాధ్యత ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం తీసుకోవాలి. బస్సుస్టేషన్ ఆధునికీకరణతోపాటు కొత్త బస్సులు, అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలి. రాజంపేట డిపోకు పూర్వవైభవం కల్పించాలి.

-జీవీ నరసయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎంప్లాయీస్ యూనియన్

ఏడు బస్సులతో డిపో ప్రారంభమైంది



కేవలం ఏడుబస్సులతో రాజంపేట ఆర్టీసీ డిపో ప్రారంభమైంది. సాతుపల్లెకు ఎదురుగా ఖాళీస్థలంలో తాత్కలికంగా బస్టాండు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి బస్సులను నడిపించారు. 1975లో డిపో ఏర్పాటులో పనిచేసే అవకాశం తనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నాను.

- ఎం.బ్రహ్మయ్య, మాజీ కండక్టరు. రాజంపేట

క్లుప్తంగా

ఉద్యమాలపై నిర్బంధం తగదు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఈనెల 9న 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ బద్ధమైన హక్కుగా జరుగుతున్న అఖిల భారత సార్వత్రిక సమ్మెను అణచివేసే దిశగా కింది స్థాయి పోలీస్ యంత్రాంగానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు ఆదేశాలు ఇవ్వడం తగదని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయచోటి పట్టణంలో ఉగ్రవాద పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయనే నెపంతో దేశ వ్యాప్తంగా చేస్తున్న కార్మిక సంఘాల ఆందోళన పట్ల, ఉద్యమకారుల పట్ల అణచివేత ధోరణి సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



మృతుడు కోనేటి పెంచలయ్య

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం మాలేమార్పురం గ్రామానికి చెందిన కోనేటి పెంచలయ్య (45) తన కుమార్తె ఇంటిలో శుభ కార్యానికి వెళ్తుండగా గంధంవారిపల్లి వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన భాగ్యమ్మ

సుండుపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మండల పరిధిలోని దిగువగుల్లవాండ్లపల్లెకు చెందిన పండ్లూరి వెంకటరమణ, అతని భార్య భాగ్యమ్మ ద్విచక్రవాహనంలో ఆంజనేయపురం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. రాయచోటి-సుండుపల్లె మార్గమధ్యంలో రాచంవాండ్లపల్లె సమీపంలో రాయచోటి నుంచి వస్తున్న ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో పండ్లూరి భాగ్యమ్మ కుడికాలు విరిగింది. ఆమె భర్తకు, ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఇమ్రాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన మహిళను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

టెక్నీషియన్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లాలో ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలలో నలుగురు టెక్నీషియన్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీపీఓ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా వాసులై ఉండి ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/సంబంధిత సబ్జెక్టులో ఐటీఐ చేసి 4 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. లేదా డిగ్రీ/డిప్లొమో కలిగి 2 సంవత్సరాల అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. అర్హత కలిగిన వారు కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 7036012154 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



వైద్య శిబిరంలో పరీక్షల కోసం హాజరైన పోలీసు సిబ్బంది

రాయచోటి : నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. మంగళవారం అన్నమయ్య జిల్లాలో పోలీసు సిబ్బందికి, ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వర్తించే పోలీసులకు మంచి ఆరోగ్యం అత్యంత ముఖ్యమన్నారు. వైద్య పరీక్షల ద్వారా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కంటిచూపు సమస్యలు వంటివి ముందుగానే గుర్తించవచ్చన్నారు. సకాలంలో చికిత్స అందించడానికి, సమస్యలు తీవ్రతరం కాకుండా నిరోధించడానికి సహాయపడతాయన్నారు. పోలీసు సిబ్బందికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. పని ఒత్తిడి, భావోద్వేగాల అణచివేత, కుటుంబ సమస్యలు వంటివి మానసిక ఒత్తిడికి దారితీస్తాయన్నారు. ఆరోగ్యంగా ఉన్న సిబ్బంది మాత్రమే తమ విధులను సమర్థవంతంగా, ఉత్సాహంగా నిర్వర్తించగలరని అభిప్రాయపడ్డారు. పోలీసు వెల్ఫేర్ ఆసుపత్రులు, ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య బీమా పథకాలు వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేవలం సిబ్బంది ఆరోగ్యం మాత్రమే కాకుండా, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

న్యాయం అడిగితే కేసులు పెడతారా?



కోలారు ఆస్పత్రిలో శివప్రసాద్

మదనపల్లె : మదనపల్లె సమీపంలోని బుద్ధుని కొండపై ప్రతిష్ఠించిన బుద్ధుని విగ్రహం తలను వేరుచేసి విగ్రహం వద్దనే పెట్టిన ఘటన స్థానికంగా సంచలనానికి దారి తీసింది. దీనికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) చేపట్టిన నిరసనల నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేయడంపై చర్చించేందుకు ప్రజా సంఘాలు, పార్టీ నేతలు బుధవారం మదనపల్లెలో సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 2న బుద్ధుని కొండపై బుద్ధుడి తలను వేరు చేసిన ఘటన వెలుగులోకి రావడంతో బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరుతూ బెంగళూరు రోడ్డులో నిరాహార దీక్షలు చేపట్టారు.దీక్షలకు అనుమతి లేదంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత ఘటనపై విచారణ మొదలు పెట్టిన పోలీసులు శివప్రసాద్‌ను పోలీస్ స్టేషన్‌లో విచారించే సందర్భంగా జరిగిన పరిణామాలతో ఆయనపై కేసు నమోదు చేశారు. దీనికి నిరసనగా 4వ తేది రాత్రి బాస్ శ్రేణులు బెంగళూరు రోడ్డుపై రాస్తారోకో చేయడంపై కేసు నమోదు చేశారు. ఇలా మూడు కేసులు నమోదు కావడంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్, మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యమలా సుదర్శనం, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణప్ప, ఇతర పార్టీల నేతలు, ప్రజా సంఘాలతో కలిసి బుధవారం మదనపల్లెలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

ఆస్పత్రిలో శివప్రసాద్

జరిగిన ఘటనలపై బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఇప్పటికే ఒకసారి గుండె సంబంధిత ఆపరేషన్ జరగ్గా తాజాగా మళ్లీ గుండెపోటుకు గురయ్యారు. వైద్యుల సలహా మేరకు కోలారులో వైద్య పరీక్షలు చేయించుకోగా ఒత్తిడి కారణంగా గుండె నాళాల సమస్య తలెత్తిందని గుర్తించిన వైద్యులు మంగళవారం యాంజియోగ్రాం చేశారు. బుధవారం స్టంట్ అమర్చనున్నట్టు బాస్ ప్రతినిధులు తెలిపారు.

మదనపల్లె ఫైల్స్ కేసులో విచారణ

మదనపల్లె రూరల్ : మదనపల్లె ఫైల్స్ దగ్ధం కేసుకు సంబంధించి పూర్వ ఆర్డీఓ ఎం.ఎస్.మురళీని సీఐడీ అధికారులు మంగళవారం విచారించారు. తిరుపతి పట్టణం కే.ఆర్.నగర్‌లోని మురళీ నివాసానికి వెళ్లిన సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, ఫైళ్ల దగ్ధం కేసుకు సంబంధించి, కొద్దిసేపు ఆయనను విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

రాజంపేట ఎంపీపీ మృతి



వెంకటనారాయణ (ఫైల్)

రాజంపేట టౌన్ : రాజంపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు వై.వెంకటనారాయణ (75) సోమవారం రాత్రి మృతి చెందారు. 2021వ సంవత్సరంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వెంకటనారాయణ ఆకేపాడు ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. మండల ప్రజాపరిషత్ పదవి బీసీలకు కేటాయించడంతో వెంకటనారాయణకు ఎంపీపీ పదవి వరించింది. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటనారాయణ మృతి చెందిన విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెంకటనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పారదర్శకంగా డ్వాక్రా రుణాల పంపిణీ

డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె రూరల్ : స్వయం సహాయక సంఘాల సభ్యులకు పారదర్శకంగా రుణాలు పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు సంబంధించి ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్స్, బ్యాంకర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉన్న సభ్యులందరితో బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. వెలుగు సిబ్బంది క్షేత్రస్థాయిలో డ్వాక్రా సభ్యుల ఆర్థిక అవసరాలను గుర్తించి తదనుగుణంగా ఎంసీపీలు తయారుచేయాలన్నారు. అర్హులకు సంబంధించిన ఎంసీపీ(మైక్రో క్రెడిట్ ప్లాన్)ను బ్యాంకుకు పంపి రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సమావేశాలను, వీఓఏల ద్వారా జియోట్యాగింగ్ పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం స్టాఫ్ ప్రసాదరెడ్డి, లక్ష్మి, వెంకటరమణ, కిజర్‌అహ్మద్, వేణుమాధవ్, ఏపీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కురబలకోట : కురబలకోట మండలం ముదివేడు మార్గంలో శనివారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన పెద్దమండ్యం మండలం దట్టే నాయక్ తాండాకు చెందిన బాలాజీ నాయక్ మంగళవారం మృతి చెందాడు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. అంగళ్లలో గొర్రెల సంతలో గొర్రెలు విక్రయించి బొలెరో వాహనంలో పెద్దమండ్యం వెళుతుండగా ముదివేడు ఫారెస్టు మార్గంలో ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొన్నారు. దీనిని తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే.

అధికారుల ముందే దాడిచేసి కొట్టారు

భూ వివాదంలో ఇద్దరికి గాయాలు





దాడిలో గాయపడిన రమణయ్య, రవీంద్ర

మదనపల్లె రూరల్ : భూవివాదం కారణంగా ఓ వర్గంలోని వ్యక్తులు, మరో వర్గంలోని వ్యక్తులపై రెవెన్యూ అధికారుల సమక్షంలో దాడి చేసిన ఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. అంగళ్లు పంచాయతీ తుంగావారిపల్లెకు చెందిన రమణయ్య(55)కు అదే గ్రామానికి చెందిన రెడ్డెమ్మతో భూ వివాదం ఉంది. కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో అదే భూమికి సంబంధించి రెడ్డెమ్మ, పీజీఆర్ఎస్‌లో తనకు న్యాయం చేయాల్సిందిగా ఫిర్యాదు చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. అదే సమయానికి రమణయ్య తన అన్న కుమారుడైన రవీంద్ర(43)తో కలిసి అక్కడకు వచ్చారు. అధికారులు విచారిస్తుండగానే వివాదం రేగి రెడ్డెమ్మ, ఆమె కుమారుడు సాయికిరణ్, వారి తరఫు బంధువులు మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ జోలేపేటకు చెందిన వెంకటరమణ, కుశాల్, దుర్గలు కలిసి రవీంద్ర, రమణయ్యలపై కర్రలతో దాడిచేసి కొట్టడంతో గాయాలయ్యాయి. గొడవపై రెవెన్యూ అధికారులు ముదివేడు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నారు.

36 జీఓ అమలు కోసం అర్ధనగ్న ప్రదర్శన

రాయచోటి టౌన్ : జీఓ నంబర్ 36ను అమలు చేయాలని కోరుతూ రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఇంజినీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ పని గంటలు పెంచి రూ.15 వేలు వేతనం ఇస్తున్నారని, పారిశుధ్య కార్మికులకు ఇచ్చినట్లుగా రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి అప్కాస్ కొనసాగించాలని లేదా పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకరయ్య, సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు, మున్సిపల్ యూనియన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ, నరసింహులు, ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ముట్టడిపై కేసు నమోదుకు సన్నాహాలు



వేంపల్లె పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు, తదితరులు(ఫైల్)



బాలిక సుమియాకు నీరు తాపిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్ (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీరుపల్లెకు చెందిన సుమియా అనే బాలిక అదృశ్యం కావడంతో సోమవారం రాత్రి పక్కీరుపల్లె, బిడ్డాల మిట్ట, కాలేజీ రోడ్డులో ఉన్న పలువురు పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేశారు. దీంతో పోలీస్ స్టేషన్‌లోని కిటికీలకు ఉన్న అద్దాలను పగులగొట్టడంతోపాటు పోలీస్ స్టేషన్‌పై రాళ్లు, వాటర్ ప్యాకెట్లు రువ్వారు. అలాగే పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాలిక సుమియా ఆచూకీ తెలిసిందని ఇక వెళ్లాలని నిరసనకారులకు పోలీసులు తెలిపిన వినకుండా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు తమ సీసీ కెమెరాల్లో బంధించిన వీడియోలను చూసి నిరసనకారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టేందుకు చర్యలు చేపట్టారు. నిరసన సమయంలో రాత్రి రోడ్లపై తిరిగే మోటార్ బైకులను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మంగళవారం మోటార్ బైకుల కోసం వచ్చిన వారితో ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని, మోటార్ బైకు వద్ద ఫొటోలు తీసుకొని పంపించి వేశారు. సీసీ కెమెరాల్లో, పోలీసులు తీసిన వీడియోలో మోటార్‌బైకుదారులుంటే వారిపై కూడా కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో వందల మందిపై కేసు నమోదవుతుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. కేసు నమోదుపై పోలీసులు బిజీ బిజీగా ఉన్నారు. ఇప్పటికే పోలీసులు ఎవరెవరి మీద కేసులు నమోదు చేయాలనేది గుర్తించినట్లు తెలుస్తోంది.

బాలిక సుమియాకు కడప రిమ్స్‌లో చికిత్స..

సోమవారం రాత్రి పక్కీరుపల్లెకు చెందిన సుమియా ఆచూకీ తెలిసిన వెంటనే పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న బాలికకు మంచి నీరు తాపించి కడప రిమ్స్‌కు పంపించారు. ఈ నేపథ్యంలో కడప రిమ్స్‌కు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన వెళ్లి చికిత్స పొందుతున్న బాలిక సుమియాను విచారించారు. మంగళవారం ఆ బాలిక కోలుకుని ఆరోగ్యంగా ఉందని సీఐ నరసింహులు తెలిపారు.

• శేష వాహనంపై సిద్దేశ్వరుడు



శేషవాహనంపై సిద్దేశ్వరస్వామి



సింహ వాహనంపై చెన్నకేశవుడు

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడి జన్మస్థలి తాళ్లపాకలో సిద్దేశ్వర, చెన్నకేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి శివ, కేశవులకు వాహన సేవలు నిర్వహించారు. సిద్దేశ్వరస్వామి శేషవాహనంపై, చెన్నకేశవస్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవలో భక్తులు స్వామివార్లకు కాయా, కర్పూరం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

సిగరెట్ తాగొద్దు అన్నందుకు యువకుడి ఆత్మహత్య



రెడ్డెప్ప (ఫైల్)

కురబలకోట : సిగరెట్ తాగొద్దు.. యుక్త వయస్సులో ఇదేమిపని అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన మండలంలోని అంగళ్లులో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ వెల్లడించిన వివరాల మేరకు..అంగళ్లు టమాటా మండీల సమీపంలో గుడిసెలు వేసుకుని కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరిలో గోపాలమ్మకు కుమారుడు రెడ్డెప్ప (20) ఒక్కడే కుమారుడు. నాలుగు రోజుల క్రితం గుడిసెల వద్ద ఇతను సిగరెట్ తాగాడు. గమనించిన తల్లి గోపాలమ్మ మందలించింది. మనస్తాపం చెందిన అతను పురుగుల మందు తాగాడు. హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకే మాట..ఒక్క జీవితం.!

ఉన్న ఒక్క కుమారుడు అకాల మరణం చెందడంతో పుత్ర శోకంతో తల్లి గోపాలమ్మ తల్లడిల్లిపోతోంది. రేయ్ రెడ్డెప్ప నన్ను క్షమించరా..సిగరెట్ తాగొద్దనడం నా తప్పయ్యింది.. నీ మేలుకోసమే చెప్పా..పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో నువ్వు ఇంతపని చేస్తావనుకోలేదురా..సిగరెట్ తాగొద్దు అనే ఒక్క మాట నిన్ను ఇంతగా కలచివేసిందా..!? ఈ జీవితాన్నే తీసుకుపోతుందని ఊహించలేకపోయారా..అంటూ ఆ తల్లి వేదన, బాధతో రోదించడం కలచివేసింది. తల్లి ప్రేమను అర్థం చేసుకోలేక యుక్త వయస్సులో ఉన్న కుమారుడు సిగరెట్టు తాగొద్దు అనే ఒక్క మాటకు చివరకు ప్రాణం తీసుకోవడంతో బంధుమిత్రులు కూడా శోకతప్తులయ్యారు.

పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలి



మామిడి మొక్కలను నాటుతున్న ఉపాధి హామీ విజిలెన్స్ అధికారిణి జుబేదా

సిద్దవటం : పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపిస్తే దిగుబడి, ఆదాయం పెరిగి రైతులకు లాభసాటిగా ఉంటుందని వైఎస్సార్ జిల్లా ఉపాధిహామీ విజిలెన్స్ అధికారిణి జుబేదా తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని మోడెం గంగాదేవి పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 2.30 లక్షల నిధులతో రెండు ఎకరాల పైబడి మామిడి సాగు కోసం నిధులు మంజూరు కావడంతో మంగళవారం ఆమె పొలంలో మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం కార్యక్రమంలో భాగంగా సిద్దవటం మండలంలోని భాకరాపేట, పొన్నవోలు, సిద్దవటం గ్రామాలకు ఉపాధి హామీ నిధులతో సాగు చేసే పంట పొలాల్లో దాదాపు 850 మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఏపీఓ నరసింహులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

జాక్ పాట్‌లు రద్దు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ

గుర్రంకొండ : టమాటా మండీల్లో జాక్‌పాట్‌లు రద్దు చేయాల్సిందేనని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తరిగొండ నౌషాద్ అలీ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ కమిటీ ఉప కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డులో రెండు వారాల క్రితమే జాక్‌పాట్‌లు రద్దు చేయాల్సిందేనని వ్యాపారులను హెచ్చరించామన్నారు. అయితే ఇంత వరకు వ్యాపారులు జాక్‌పాట్ రద్దు చేయకుండా ఇంకా ఎక్కువగా తీసుకోవడం దారుణమన్నారు. రైతులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. 25 కేజీల క్రేట్‌ల స్థానంలో 15 కేజీల క్రేట్లు మార్చాలని గత సమావేశంలో తీర్మానించామన్నారు. అయితే గుర్రంకొండలో ఇంతవరకు వ్యాపారులు అమలు చేయలేదన్నారు. దీనికి మార్కెట్ కమిటీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బయ్యారెడ్డి, మహబూబ్ బాషా, నాయకులు పాల్గొన్నారు.

తడి చెత్త, పొడిచెత్త వేరు చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న డీపీఓ రాధమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని అన్ని గ్రామాలను పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారిణి రాధమ్మ సిబ్బందికి సూచించారు. మంగళవారం సుండుపల్లెలో పారిశుధ్య పనులను, డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి సంపదను తయారు చేయాలన్నారు. వీధి పొలు లేని చోట్ల ఏర్పాటుకు, అలానే ఉన్న చోట్ల మరమ్మతు, నిర్వహణ చేపట్టాలన్నారు. బస్‌షెల్టర్‌లో ప్రయాణికులకు వసతులు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, పంచాయతీ సెక్రటరీ రామమోహన్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, మండల వ్యాప్తంగా వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సెంచరీలతో కదం తొక్కిన కడప బ్యాట్స్‌మన్లు



108 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ ప్రణీల్‌రెడ్డి



114 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ సుదర్శన్



85 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ రోహిత్ వర్మ



98 పరుగులు చేసిన పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి గణేష్



4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్

తొలి రోజు 461 పరుగులు చేసిన కడప జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో తొలి రోజు మంగళవారం వైఎస్ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప బ్యాటర్లు సెంచరీలతో కదం తొక్కారు. కడప, అనంతపురం జట్లు తలపడగా ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 461 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీల్ రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 138 బంతుల్లో 20 ఫోర్లతో 108 పరుగులు చేశాడు. టి.సుదర్శన్ చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ ఆడి 109 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్సర్లతో 114 పరుగులు చేశాడు. రోహిత్ వర్మ 85 పరుగులు, అర్థిత్ రెడ్డి 70 పరుగులు చేయడంతో కడప జట్టు తొలి రోజు భారీ స్కోరు చేసింది. అనంతపురం జట్టులోని నవదీప్ 3 వికెట్లు, కేహెచ్ వీరారెడ్డి 3 వికెట్లు తీశారు.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు -చిత్తూరు జట్లు తలపడ్డాయి, ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 98 పరుగులు, భార్గవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4 వికెట్లు, ఫణి 2 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 11 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.